# వెలుగు రేఖ

## చీర్ల సీతాదేవి

(గత సంచిక తరువాయి)

అతనికళ్ళల్లో కన్పిస్తున్న కోరికను చూస్తూ నిముషం పాటు అలాగే వుండి పోయింది.

................

"మూర్తీ" తలుపు దబదబ బాదిన చప్పుడు కర్ణకఠోరంగా.

వులిక్కిపడింది తలుపుకేసిచూసింది.

ఎవరో తలుపు తడుతున్నారు.

తనింత సేపూ గడిపింది వూహల్లోనా! లేచి తలుతెరిచింది. ఎదురుగా వుంది హాస్పిటల్ కుర్రాడు.

"మూర్తిగారండీ యీ రాత్రికిరానని చెప్పమన్నారు. సీరియస్ కేసోస్తే డాక్టరు గారి వెంట వెళ్ళారు."

చెప్పడం ముగించి కుర్రాడు సైకిల్ మీద తుర్రుమన్నాడు.

రాజ్యం కాసేపు అక్కడే అలాగే నిలబడిపోయింది.

'అతని ప్రపంచం వేరు. యిద్దరికీ ఎప్పటికీ పొంతన కుదరదు. ఇకతానేమీ ఆశలు పెట్టుకోకూడదు. యీజన్మ కింతే రాసుందని బతికినంత కాలం గడిపెయ్యాలి.'

విరక్తిగా అనుకుంది.

భళ్ళున తలుపులుమూసివచ్చి మంచం మీద వాలిపోయింది.

○ ○ ○ ○

తెల్లతెల్లవారుతుండగా తలుపులచప్పుడికి విసుగ్గా లేచివెళ్ళి తలుపులు తీసింది రాజ్యం. మూర్తి లోపలికొచ్చి తలుపు వారగా చెప్పులు విడిచి మంచంమీదవాలి పోయాడు. ఒక చెయ్యి గుండెలమీద ఒక చెయ్యికళ్ళకడ్డంగా వుంచుకున్నాడు కళ్ళుమూసుకుని.

రాజ్యం తలుపు గడియపెట్టి మంచానికి రెండోవైపు నిలబడి అతన్నిచూసింది.

రాగానే అలా పడుకోకపోతే 'రాజ్యం. నా కోసం మేలుకుని ఎదురుచూశావా? యింకెప్పుడూ రాత్రులు వెళ్ళనులే' అని ఏదో ఒకటి మాట్లాడొచ్చుగదా. తన్ని దగ్గరికి తీసుకుని పడుకోవచ్చుగా, వుహూ - అటువంటి ఆలోచనలురావు. అతని ప్రపంచమే వేరు.

కోపగించుకొని మంచంకొనన పడుకొని గోడవైపుతిరిగి కళ్ళు మూసుకుంది. మూర్తి మనసులో అశాంతి....అలజడి. ప్రయత్నించినా కంటిమీదికి కునుకు రావడంలేదు. వొద్దనుకున్నా కళ్ళముందు

పాప అమాయక వదనం....తల్లి ఘోష అతని హృదయాన్ని కలచివేస్తున్నాయి.

చిన్నారిపాప అయిదేళ్ళ వయస్సునే నూరేళ్లు నిండిపోయింది, తల్లిదండ్రులకు తన జ్ఞాపకాలనూ తీరని వ్యధను మిగిల్చి,




రాత్రంతా జాగారంచేసి పాపని బ్రతికించాలని విశ్వప్రయత్నంచేశారు డాక్టరుగారు. జబ్బు, తల్లిదండ్రులమూర్ఖత్వమూ పిల్ల ప్రాణాలు హరించాయి. ఈకాలంలో కూడా ఇంకా మంత్రాల్ని వొదలడం లేదంటే ఏమనుకోవాలి?

"డాక్టరుగారూ, యిరుగు పొరుగు మాటలువిని అతను ఎంతమందికోనయం చేశాడన్న ఆశకొద్దీ సాయిబుని పిలిపించాము. సూది మంత్రానికి పత్యం అవసరం లేదన్నాడు. పిల్లమీదనుంచి మంత్రం వేస్తూ సూదిని మూడుసార్లు తిప్పి ఆ సూదిని నీళ్ళ గిన్నెలో వేసేవాడు. చూస్తూండగానే నీళ్లు పసుపురంగులోకి మారేవి. ఇలాగే దిగిపోతుందిజబ్బు అనేవాడు. మోసపోయాం. నా బంగారు తల్లిని చేతులారా పోగొట్టుకున్నా'మంటూ ఆ తల్లి గుండెలు బాదుకుని ఏడుస్తూ ఉంటే వినలేకపోయాడు. జాండిసు బాగా ముదిరిపోయింది. బైల్సు యూరిన్‌లోనే కాకుండా రక్తంలో కూడా ప్రవేశించి కలుషితం చేశాయి. రక్తం రంగు మారిపోయింది. అటువంటి ఆఖరు క్షణాల్లో డాక్టర్ మాత్రం ఏంచేస్తాడు?

కళ్ళు మూసుకుని పడుకోలేక

పోయాడు.

చెయ్యి అడ్డుతీసుకుని చాప మీద నిల్కురజాయిలో పడుకున్న పాపకేసి చూశాడు. పాప అందంగా ఆరోగ్యంగా గ్లాక్సో బేబీలా వుంది. తృప్తిగా శ్వాస పీల్చుకుని పక్కకి తిరిగిచూశాడు.



రాజ్యం మంచంమీదలేదు వంటగది లోంచి చప్పుళ్లు వినిపిస్తున్నాయి.

కిటికీగుండా బాలభానుని లేతకిరణాల జిలుగు వెలుగు లోపలికి చొచ్చుకుని వస్తూంది. చూస్తూ యింకానేపు మంచం మీదే ఉండిపోయాడు.

అతనికి అప్పుడు రాజ్యం- 'మూర్తీ! అలావున్నావేం' అని తన తలను వొళ్లోకి తీసుకుని తన చల్లని వేళ్ళతో నుదురు వత్తితే బాగుండుననిపించింది. లేచి అన్యమనస్కంగానే పనలు పూర్తిచేసుకుని రోజూవెళ్ళే వేళకే యిల్లుదాటాడు.

○ ○ ○ ○

కోపంతో మనసు మండుతూంటే ఛళ్లున తలుపుమూసి వచ్చి మంచం మీద వాలిపోయింది రాజ్యం. "పెద్ద - తనే వుద్యోగం వెలగబెడుతున్నట్టు-రాత్రంతా జాగారంచేసి వొచ్చాడా - ఓగంట పడుకుని నిద్రపోతేకాదూ - అప్పుడే లేచి పరుగు - మెప్పుకోసం - పోనీయ్ తను మాత్రం ఏంచేస్తుంది? చెప్పినా వినేరకం కానప్పుడు- అతనిష్టం అతనిది" అనుకుంది.. చాలానేపు పడుకొనే ఉండపోయింది.

'తమకన్నా అందమైన వాళ్లుకాదు. వయసులోనా పెద్దవాళ్ళే. అయితేయేం సుఖంగా హాయిగా వున్నారు. ఎట్లావుండగలుగుతున్నారో? సుందరిని అడగాలి' అనుకుంది. వంట చేసుకుకోవాలనిపించ లేదు. లేచి టీ, తాగింది.

మధ్యాహ్నం వేళ—

సుందరి పంపుదగ్గర బట్టలుతుకుతున్న చప్పుడుకి తలుపు తీసుకుని దొడ్లోకి వెళ్ళింది. సుందరి బట్టలు ఆరవేస్తూ రాజ్యాన్ని చూసి నవ్వింది.

తనూనవ్వి "మీరు బదిలీ మీద వొచ్చారా యీవూరు" అని అడిగింది.

"ఔను. ముందు కొత్తగూడెంలో ఉండేవాళ్ళం"

''మీపెళ్ళయి ఎన్నాళ్ళయిందీ?''

"నాలుగేళ్ళు" అనుకుంటూ వేళ్ళు చూపించింది.

రాజ్యం కాస్త ఆశ్చర్యపోయి" పిల్లలు లేరా?'' అంది

''అప్పుడే వొద్దనుకున్నాం"

ప్రతి మాటా నవ్వుతూ మాట్లాడుతుంది సుందరి.

"మరి మీకో''

"పెళ్ళయి రెండేళ్ళు. యీడాది పిల్ల. పుట్టిల్లు యీవూరే"

ఎందుకో నిర్లిప్తంగా జవాబిచ్చి వూరుకుంది రాజ్యం.

"వస్తానండీ" అనేసి సుందరి బాత్‌రూంలో ముఖం కడుక్కొని లోపలికెళ్ళి తలుపులు మూసుకుంది.

"అతను భోజనానికి వచ్చే వేళయింది గా తయారవుతుంది గామోసు"

అనుకుని తలుపులు మూసి వచ్చి మంచంమీద వాలింది.

ఆలోచనల్లో కొట్టుకుపోసాగింది.

"జోడు గుర్రాల బండిలా సంసారం సాగిపోతుందంటే రెండు కాళ్ళవాడు ఒంటి కాలివాడూ కలిసి పరుగు పందెం వేస్తున్నట్టుగా వుంది తనసంసారం" అనుకుని నిట్టూర్చింది.

మనసులో అశాంతి అగ్ని పర్వతం రాజుకుంటోంది.

పక్కవాటా లోంచి నవ్వు లూ-మాటలూ వినిపిస్తున్నాయి.

కాసేపు పుస్తకం తిరగేసింది.... మనసు లగ్నం కాలేదు

లేచి, చీరమార్చుకుని పిల్లనుతయారు చేసి ప్లీడరుగారింటికి వెళ్ళి కూర్చుని సాయంత్రంవరకూ అక్కడే గడిపి వచ్చింది.

ఆరోజు-ఆ మరురోజు-తరవాతరోజు కూడా చిర్రుబుర్రులాడుతూ అంటీ ముట్టనట్టు పొడి సమాధానాలిస్తూ చాలాముభావంగా వుండిపోయింది అతనివద్ద.

"రాజ్యం నువ్వు మనసులో ఏదో వుంచుకుని నాతో సరిగ్గా మాట్లాడకపోతే నాకు ఏంతెలుస్తుంది చెప్పు" అని అడిగాడు మూర్తి ఒకరోజు.

"నీకు చెప్పి లాభంలేదు. అది నా ఖర్మ అని సరిపెట్టుకుంటున్నాను. అంతే" అని అతని ముందునుంచి వెళ్ళిపోయింది

మూర్తి అవాక్కుగా వుండిపోయాడు

"చీటికి మాటికి అలిగి కోపగించుకుంటుందెందుకో రాజ్యం. నేనేం లోటు చేస్తున్నానని? క్రిందటి నెల చీర కొనిచ్చాను. కిరోసిన్ స్టౌవ్‌తో బాధపడలేకున్నానంటే ఎలక్ట్రిక్ స్టౌవ్ కొనిపెట్టా" అనుకున్నాడు

అనుక్షణం అశాంతి - అసంతృప్తి-వొంటరితనం. తోచకపోవటాలతో రాజ్యానికి మనశ్శాంతిలేకుండాపోయింది.

ఎలాగో పది రోజులు వోపికపట్టింది ఇక వుండాలనిపించలేదు. పుట్టింటికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుని బట్టలూ పెట్టె సర్దుకుని బయలుదేరింది.

అది చైత్ర మాసం చివరి రోజులు. ఎండనిప్పులు చెరుగుతోంది.

రోడ్డుమీద జనసంచారంలేదు. కాకి అరుపుకూడా వినపడటంలేదు. వడగాలి వీస్తూంది. అతనొచ్చేసరికి ఇంట్లో ఉండకూడదన్న పంతంకొద్దీ యింటికి తాళం వేసి వీధిలో కొచ్చింది.

అప్పుడు సమయం మూడుకావస్తూంది

రోడ్డుమీద ఒక్క రిక్షాకూడా కనిపించలేదు.

పిల్లని భుజాన వేసుకుని ఓ చేత్తో సూట్ కేస్‌తో నడుస్తూంది.

మిరుమిట్లు గొలిపే ఎండవేడి-కళ్ళు చూడలేక పోతున్నాయి.

మొండిగా నడుస్తూవుండగా ఎదురుగా వొచ్చిన రిక్షాలోకూర్చుని పోనివ్వమంది.

o o o o

గుమ్మంలో రిక్షాదిగి లోపలి కొచ్చిన



రాజ్యాన్ని చూసి మేనత్త తెల్లబోయింది.

చెమటలుకారుస్తూ ఎర్రబడ్డమొహంతో తోటకూర కాడలా వాడివున్న రాజ్యాన్ని, ఒకసారి పలకరించిచూసి,

"చంటి పిల్ల నేసుకుని బొగులు బొగులు మంటున్న ఎండలో రాకపోతే చల్లబడ్డాక రాగూడదూ" అంటూ రాజ్యం భుజాన్నవున్న పిల్లను అందుకుంది

రాజ్యం ఆవిడకేమీ జవాబివ్వలేదు.

నవానరి తల్లిగదిలోకి వెళ్ళి పెట్టె అక్కడపడేసి మంచంపైవాలిపోయింది.

అంతే ఆవడక పడక మళ్ళీ వారం రోజుల వరకూ తల్లీ పిల్లా కోలుకోలేదు. వడదెబ్బ అని డాక్టరు మందు ఇచ్చాడు.

"మూర్తికి కబురు చెయ్యానా?" అన్నాడు తండ్రి.

"అక్కర్లేదు" అనేసింది.

రాజ్యం అన్నగారి పెళ్ళికి వచ్చిందని ఆ యింట్లో ఎవరూ అనుకోలేదు. వేణు పెళ్ళి యింకా వారంముంది. పిల్లని పైరా.

తండ్రి కంట్రాక్టరు ఖమ్మంలో పెత్తల్లి యింట్లో వుండి వి మెన్స కాలేజిలో బి. ఏ పాసయింది.

పెళ్ళి రోజు రానే వచ్చింది. ప్రయివేటు బస్సు మాట్లాడుకుని పెళ్ళి రేవనగా ఆముందు రోజే తరలి వెళ్లారు పెళ్ళివారు. మూర్తి పెళ్ళినాటికి వస్తానని చెప్పాడు.

మామూలు చిట్టి పొట్టి అభిప్రాయ భేదాలతో వెళ్ళుయి పోయింది.

పెళ్ళివారంతా బస్సుఎక్కారు. పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు ఫ్రంటు సీటులో కూర్చున్నారు- ఆ వెనక సీట్లో రాజ్యం కూచుంది.

ఆడా మగా పిల్లా పెద్దా అంతా కలగలుపుగా ఎవరికి తోచిన చోట వాళ్ళు కూచున్నారు. బస్సు బయలు దేరింది.

కొత్త జంట కబుర్లలోకి దిగింది. కొన్నేళ్ళ తర్వాత కలుసుకున్న ప్రాణ స్నేహితుల్లా మాట్లాడుకుంటున్నారు వాళ్లు. మాటలమధ్యలో ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ల

చూసుకుని నవ్వుకుంటున్నారు. వాళ్ళకి తమతో పాటు ఇంకా చాలామందివున్నారని ధ్యాస లేదు. రాజ్యం పక్కన ఖాళీ వున్న సీట్లోకి వొచ్చి కూర్చుంది. వెనక యిరుక్కుని కూచున్న ఓ ముసలమ్మ. రాజ్యం ఆవిడవేపు చిరాగ్గా చూసి, మూర్తి కోసం చుట్టూ వెతికింది కళ్ళతోనే.

ఓ చుట్ట కాలుస్తున్న ముసలాయన పక్కనే కూచుని తలొంచుకుని ఆయన కబుర్లు వింటున్నాడు.

"ఏం మనిషి వొట్టి జంగ్లీ," అనుకుంది చిరాగ్గా.

కొందరు కుటుంబసమేతంగా, కూచుని తాపీగా ముచ్చట్లాడుకుంటున్నారు.

రాజ్యం విసురుగా తల తిప్పుకుని కిటికీ లోంచి చూస్తూ వుండి పోయింది.

ఇంటిదగ్గర కొత్త దంపతులకి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పర్మిటు ఇచ్చినట్టు ఎవరూ వాళ్ళజోలి పట్టించుకోవటంలేదు. చూసీచూడనట్టు వూరుకుంటున్నారు.

కూర్చున్నా పక్క పక్కనే. నిలబడ్డా పక్కక్కనే. ఆవిడ ఎక్కడుంటే అత నక్కడ.

రెండు సినిమాలు చూసొచ్చారు. ఓ రోజు సాయంత్రం గుట్టమీద దేవాలయానికి. ఇంకోరోజువాకింగు. రెండురోజులు కాళ్ళ నొప్పులని లేవలేదు రాధిక.

"అన్నయ్య వొదినకాళ్లు పట్టే ఉంటాడు."అనుకుంది రాజ్యం.

ఆ రోజు సాయంత్రం - హాల్లో గడి గుమ్మానికి ఓ పక్కగా వున్న బెంచీమీద కూచుని నెయిల్ పాలిష్ వేసుకుంటూంది రాధిక - వేణు ఆమె పక్కన కూచుని చూస్తున్నాడు.

రాజ్యం అక్కడవున్న సోఫాలో కూచుంది, చేతిలో పుస్తకంవున్నా ధ్యాస మాత్రం అన్నా-వదినలమీదే వుంది.

కుడికాలు బల్లమీద వుంచుకుని కాలి గోళ్లకి పాలిష్ వేసుకోసాగింది రాధిక. చూస్తూ కూర్చున్న వేణు 'యిలాతే నే వేస్తాను' అని రాధిక దగ్గర బ్రష్ తీసుకుని తన అరచేతిలో ఆమె పాదం వుంచుకుని ఎంతో శ్రద్ధగా వెయ్య సాగాడు.

సరిగ్గా ఆ సమయాన లోపలికొచ్చిన మూర్తి ఒక్క క్షణం వాళ్ళవైపు చూసి మరుక్షణం చూపు తిప్పుకుని రాజ్యానికి ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు.

'చూశావా' అని అడుగుతున్నాయి రాజ్యం చూపులు.

మూర్తి చిన్నగానవ్వి 'పాప ఏదీ'అని అడిగాడు.

రాజ్యానికి వొళ్లు మండిపోయింది. 'పడుకుంది' అని జవాబిచ్చి వూరుకుంది.

వేణు 'రాజ్యం నవ్వూరావే వేస్తాను' అన్నాడు.

రాధిక 'మీరెందుకూ మా అన్నయ్య వున్నారుగా. ఆయన కివ్వండి వేస్తారు' అంటె నవ్వుతూ. అతను కూడా నవ్వు చెప్పండి రైటేనన్నట్టు తలాడించి, 'ఇదుగో తీసుకెళ్లు' అని సీసా ముందుకు చాపాడు. రాజ్యం భర్తవైపు చూశాడు.

అతను చటుక్కున ముందుకు వొంగి టీపాయ్ మీదున్న పత్రిక చేత్తో పట్టుకున్నాడు.

ఛరుమని కోపమొచ్చింది రాజ్యానికి అన్నగారికి యిట్లా సమాధాన మిచ్చి, చివ్వునలోపలికి పోయింది-"గంగుసీసా

చెయ్యి తీసుకెళ్ళి మీ బావముందు పెట్టినా, ఆయన కంటికి గోళ్ళ అందంగానీ, వేళ్ళ నాజూకుగానీ తెలియదురా. చేతి మీద మీద కాలిన బొబ్బలో కత్తిపీట గాట్లో చూసి రంగునీసా పక్కనపడేసి పరుగెత్తుకెళ్ళి పెన్సిలిన్ ఆయింట్‌మెంటూ డెట్టాల్ సీసా తెచ్చి పూసేస్తారు."

అదేదో పెద్ద జోక్ అన్నట్టు వేణు పెద్దగా నవ్వితే మూర్తి పేపరులోంచి తలెత్తలేదు. రాధిక నెయిల్ పాలిష్ తీసుకుని గదిలోనికి వెళ్ళిపోయింది.

వేణు మూర్తిని మాటల్లోకి దింపాడు. అయిదు నిముషాలాగి 'నే వెళ్ళాలోయ్' అంటూ లేచాడు మూర్తి.

"వుండు బావా ఇప్పుడేగా వస్తి" అని లోపలికి వెళ్ళి "రాజ్యం బావకు కాఫీ పట్రా" అని కేక వేశాడు.

"వొద్దు వేణూ. అన్నిసార్లు కాఫీ నాకు అలవాటు లేదు" అనేసి వెళ్ళిపోయాడు మూర్తి.

కాస్తాగి పొగలు గక్కుతున్న కాఫీ కప్పుతో వొచ్చిన రాజ్యం అలాగే నిలబడిపోయింది.

o o o

మర్నాడు-

ఏదో పనిమీద బయటికి వెళ్ళిన వేణు యింకా యింటికి రాలేదు. ఒంటిగంట దాటింది. తల్లి, మేనత్త నిద్రలో వున్నారు. రాజ్యానికి ఏమీ తోచక రాధిక గదిలోకి వచ్చింది. రాధిక టేబుల్ మీద రెండు దుప్పట్లు వొత్తుగా పరచి వేణు షర్టులు యిస్త్రీ చేస్తూంది.

రాజ్యం కుర్చీలో కూర్చుంది.

"మీకు మధ్యాహ్నం నిద్రపోయే అలవాటు లేదా?" అంటూ పలకరించింది రాధిక.

"నిద్ర పట్టదు తోచీచావదు" అని క్షణం ఆగి "నువ్వు వుద్యోగంచేస్తావా?" అని ప్రశ్నించింది.

"చదువుకున్నవాళ్ళంతా వుద్యోగం చెయ్యాలని మీ వుద్దేశమా?" ఎదురు ప్రశ్నించింది రాధిక.

"మరి చదువుకోవటం ఎందుకూ?"

"మనచుట్టూ ప్రపంచం తెలుసుకోవటానికి, మనిషిగా నలుగురిలో బ్రతకటానికి"

మాట్లాడలేదు రాజ్యం. ఇస్త్రీ షర్టు మడతపెట్టి పక్కన పెట్టింది రాధిక. చనువుగా "వొదినా నిన్న మీకోసం వొచ్చిన అన్నయ్యని చిన్నబుచ్చి పంపేశారు. నాకు ఎలాగో అన్పించింది" అంది.


"ఆయనొచ్చింది నాకోసమేనేమిటి" నిర్లక్ష్యంగా అనేసి పుస్తకం చేతిలోకి తీసుకుంది.

"మరి"

చేతిలోపని ఆపి చటుక్కున రాజ్యం వైపు చూసిన రాధిక- ఆమె ముఖవైఖరి చూసి తెల్లబోయింది.

"అన్నయ్య మంచివాడనుకున్నారంతా పెళ్ళిలో" షర్టు యిస్త్రీ చేస్తూ మెల్లగా అంది.

'ఎందుకనుకోరూ. అందరికీ మంచే. వూరందరికీ అప్పు. కోడలికి మాత్రం అత్త. నీ కాళ్ళు వొళ్ళో పెట్టుకుని గంగేసే మొగుడు దొరికాడు కాబట్టి నీకంతా మంచిగానే కనిపిస్తారు.' పైకి అనలేదు రాజ్యం.




పుస్తకం పేజీలు తిప్పుతూ వుండి పోయింది.

రాధికకి పెళ్ళిలో జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది.

పెళ్ళివారి విడిదిలోకి వొచ్చిన మగ పెళ్ళివారి తాలూకు ఆడవారిని పెళ్ళి కూతురి తల్లి ఎదురేగి తీసుకొచ్చి ఆహ్వానించి భోజనాలమీద కూర్చోబెట్ట లేదని అలిగి గిరుక్కున తిరిగి వెళ్ళి పోయారు. పెళ్ళికొడుక్కి పంపిన భోజనం తిరిగొచ్చేసింది. పెళ్ళి కూతురి మేన మామలూ, పిన తండ్రులూ, కలగజేసు కొని బ్రతిమాలినా లాభంలేకపోయింది. 'ఆవిడ పాతకాలం మనిషి. మగవాళ్ళనీ ఆడవాళ్ళనీ కలిపి వొడ్డించటంవల్ల ఆవిడ బయటకు రాలేకపోయింది' అంటూ ఎంత ప్రాధేయపడినా మగపెళ్ళివారు బిగపీసుకున్నారు. తిరిగిపోయే వరకూ పచ్చిగంగ ముట్టబోమని శపథాలుచేసే వరకూ వెళ్ళారు.

అప్పుడు మూర్తి కల్పించుకొని ముందుకొచ్చి యిరుపక్షాలనీ సర్ది పెళ్ళి సవ్యంగా జరగటానికి కారణమయ్యాడు. అప్పుడు తనే కల్పించుకోకపోతే చిన్న గొడవ చిలికి చిలికి గాలివాన అయి ఉండేదే.

రాజ్యం గదిలోంచి వచ్చేసింది. పాప నిద్రపోతూవుంది. పక్కన పడుకుని పాపను దగ్గరకు తీసుకుని నిద్ర పోతూ వుంది పక్కన పడుకొని పాపను దగ్గ రకు తీసుకుని నిద్రపోయింది.

○ ○ ○ ○

మూడు గంటలప్పుడు మేనత్త టీ పెట్టి ఇచ్చింది. టీతాగుతూ 'రజనినిచూసి చాలా రోజులయింది. వెళ్తేనో' అనుకుంది.

పావుగంటలో తయారై గాంధీ చౌక్‌లో వున్న రజని ఇంటికి వెళ్ళింది. రజని ఇంట్లోనే వుంది. రాజ్యాన్ని లోపలకు తీసుకుపోయింది. కబుర్ల మధ్యలో 'రజనీ ఈఏడాదితో చదువైపోతుందిగా.

ఏం చేస్తావు?' అంది.

"చదువయ్యాక వుద్యోగం."

"ఆ తర్వాత?"

"నువ్విడిగేది పెళ్ళిగురించా? అవి మా నాన్నా వాళ్ళకి వొదిలేశాను!"

"అనసూయలా నువ్వు లవ్ మారేజి చేసుకోవా?"

"వుహూ. వాటిమీద నాకు నమ్మకం లేదు. హాయిగా పెద్దవాళ్ళు కుదిర్చినపెళ్ళే చేసుకుంటాను."

"బొత్తిగా ముక్కూ మొహం తెలీని వాడ్ని చేసుకుంటే అతని అభిప్రాయాలేమిటీ, ఎటువంటి వాడో ఎలా తెలుస్తుందే? తర్వాత పోట్లాటలు రావూ"

"రాజ్యం, ఆ మాటకొస్తే ఏ యిద్దరి అభిప్రాయాలూ ఒక్కటికావు, సర్దుకుపోవాలి. సంసారం అన్నాక గిల్లికజ్జాలు పెట్టుకుంటూ-మళ్ళీ కలుస్తూ-అలుగుతూ అవమానించుకుంటూ-గడిపెయ్యాలి"

ఎంతో అనుభవమున్న దానిలా రజని చెప్తుంటే అలా చూస్తూ వుండిపోయింది రాజ్యం.

"మీ ఆయన చాలా మంచివాడటగా" అడిగింది రజని.

"నీ కెట్లా తెలుసు"

"విన్నాను."

కాసేపు వూరకుండిపోయిన రాజ్యం 'ఇక వస్తానే. పాపలేచే వేళయింది' అని ఇంటి కొచ్చేసింది.

రావటమే మంచంమీదవాలిపోయింది.

కాసేపు కళ్ళుమూసుకుని పడుకుంది. కాసేపు సీలింగుని చూస్తూ గడిపింది. దిగ్గునలేచి దండెం మీద, పరుపు కింద కనిపించినంత మటుకు బట్టలు పెట్టిలో కూరుకుని, పనిపిల్లతో రిక్షా తెప్పించుకుంది.

"అమ్మా, అత్తయ్యా, నే వెళ్తున్నా నాన్నొచ్చాక చెప్పండి" లోపలున్న తల్లికీ, మేనత్తకీ వినపడేలా ఓ కేక పెట్టి పిల్లతో వొచ్చి రిక్షాలో కూర్చుంది.

ం ం ం ం

గేటు తీసుకుని లోపలికొచ్చిన రాజ్యం దృష్టి ముందు పక్కవాటామీద పడింది.

తలుపుకి వేసివున్న తాళం, తెరచి వున్న కిటికీలూ చూసి 'పీళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారేమిటీ' అనుకుంటూ కిటికీ లోంచి లోపలికి తొంగి చూసింది.

గోడ పక్కగా ఓమడత మంచం వాల్చి వుంది. రెండో వైపు టేబుల్, ముందు ఓ పాత కుర్చీ. గోడ వారగా రెండ్రంకు పెట్టెలు. గోడకి వేలాడుతున్న పాంట్లు షర్టులు- వంట గదిలో కూజాలోంచి నీళ్ళధారలు కట్టి వున్నాయి.

"అరె. వీళ్ళువెళ్ళిపోయారన్న మాట" అని ఒక్క క్షణం అన్పించినా పోన్లే గొడవ వొదిలిపోయింది అనుకుంది.

తలుపు తీసుకుని తన వాటాలోకి వెళ్ళింది. పిల్లని మంచంమీద పడుకోబెట్టి వంటగదిలోకి వెళ్ళి గిన్నెలమీగ మూతలు తీసి,చూసింది. అన్నానికి చీమలు-బెండ కాయవేపుడు బొగ్గులా మాడి వుంది.

"ఏం మనిషో అంతా చాదస్తం. హోటల్లో తింటే పోదూ" అనుకుంది. విసుక్కుంటూనే వంటపూర్తిచేసి, అతని కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

పది దాటాక వొచ్చాడు మూర్తి.

రాజ్యాన్ని చూడగానే అతని కళ్ళు తళుక్కున మెరిశాయి

అతని కళ్ళల్లో కాంతిని చూసిన రాజ్యానికి వెళ్ళి అతని వాళ్ళో వాలి పోవాలని పించింది

స్నానం చేసి వస్తానంటూ అతను తుండు తీసుకుని బాత్ రూంలోకి వెళ్ళి పోయాడు. రాజ్యం చాలా సేపు నిల్చున్న చోటనే వుండి పోయింది

అతని స్నానం అయ్యాక యిద్దరూ కలిసి భోజనం చేశారు. తింటున్నంత సేపూ రాజ్యానికి అన్నావొందనల కబుర్లే.

తెల్లారాక "రాజ్యం ఎప్పుడూ యిట్లా నవ్వుతూ కబుర్లు చెవుతూ వుంటే" అనుకున్నాడు మూర్తి

"మూర్తీ నవ్వు రోజూ యిలా వుంటే నీతో పోట్లాడనే పోట్లాడను" అనుకుంది రాజ్యం.

ం ం ం

మూర్తి డ్యూటీకి వెళ్ళి పోయాడు. రాజ్యం వంట గదిలో పని చూసుకుంటు ంది,

'ఏమండీ' అన్న పిలుపుకి ముందు గదిలోకి వచ్చింది.

ఎవరో అపరిచితుడు పాప నెత్తుకుని గుమ్మంలో నిలబడి వున్నాడు.

"ఎవరుమీరు?" అన్నట్లున్న రాజ్యం చూపులకు జవాబుగా.

"మీపాప అనుకొంటా, మట్టిలంటూ వుంది" అని పాపను దించి "నేను యీ పక్క వాటాలో వుంటున్నాను" అని చెప్పి వెళ్ళిపోయాడు అతను.

రాజ్యం తలుపువేసివొచ్చి పాపనోరు కడిగింది.

ఆ రోజు పనిమనిషి రాలేదు. వంట పూర్తి చేసి పంపుదగ్గర బట్టలుతికి, ప్లాస్టిక్ బకెట్ నిండా నీళ్లు తెచ్చుకుంటూ నిండు నీళ్ళ బకెట్ ... పించి, కింద పెట్టి పక్కగా ట పేపు చూసింది.

అతను ఇంకా నైట్ డ్రెస్‌లోనే ఉన్నాడు.

రాజ్యం అటుచూడగానే 'మీరేమీ అనుకోనంటే ఒకమాట. ఆడవాళ్ళు అంతంత బరువులు మోయటం నేను చూడలేను. అలా వుంచండి. నేను పట్టుకొస్తాను'.

అతను చొరవగా రాజ్యం దగ్గరకు వచ్చాడు.

"వొద్దండీ. తీసికెళ్ళగలను' అంది రాజ్యం మొహమాటంగా.

"మా అమ్మగానీ చెల్లిగానీ అయితే చూస్తూ వూరుకుంటానా? వుండండి" అతను పెద్దబకెట్ అవలీలగా వంటింట్లోకి తీసుకెళ్ళాడు. రాజ్యం వెనకేవెళ్ళింది.

"థాంక్స్" అంది రాజ్యం.


"ఈ మాత్రానికే" అంటూ వెళ్ళి పోయాడతను.

రాజ్యం పొయ్యిగట్టు అనుకుని నిలబడి అరచేయి చూసుకుంది.

వేళ్లు ఎర్రగా కంది వున్నాయి.

మూర్తి తనిలా నీళ్ళు మొయ్యటం ఎన్నోసార్లు చూశాడు. రాజ్యం ఆలోచనల్లో మూర్తి మెదిలాడు. రోజులు గడుస్తున్నాయి.

రాజ్యం మూర్తిమీద అలిగి వారన్నుంచీ అతనితో ముభావంగా వుంటూ వుంది. మూర్తి తల్లికి బాగుండలేదని




ఉత్తరం వస్తే చూడ్డానికి వెళ్ళాడు.

ం ం ం ం

పాపముందు ఆటవస్తువులు వదేసి ఏదో పుస్తకం చదువుతూ పడుకుంది రాజ్యం. ఎప్పటికో పాపవేపు చూసింది. పాప అక్కడ లేదు. ఆటసామాన్లు చెల్లా చెదురుగా పడివున్నాయి.

'మీరా' అని పిలుస్తూ వంటగదిలోకి పెరట్లోకి వెతికింది. పక్కవాటా తలుపులు తీసివుంటే అటువెళ్ళి అక్కడి దృశ్యం చూసి ఆగిపోయింది. అతను మంచం మీద పడుకుని వున్నాడు. పాప అతని గుండెలమీద కూర్చుని ఆడుతోంది. తను బిస్కట్ తింటూ అతని నోట్లో పెడుతోంది. 'మూర్తి ఎప్పుడైనా యిట్లా ఆడించాడా?'

అంతలో పాప తల్లిని చూసి "అమ్మ! అమ్మ" అంటూ చేతలు చాపింది.

అతను చప్పున తలతిప్పి వెనక్కి చూసి "పాప కోసం వెతుకుతున్నారా" అన్నాడు లేచి కూచుని

రాజ్యం మాట్లాడ లేదు.

"పాపా వెళ్ళమ్మా" అని అతనంటుంటే పాప గట్టిగా అతన్నే పట్టుకుంది.

అతను నవ్వుతూ రాజ్యాన్ని చూశాడు రాజ్యం తలవంచుకుని వచ్చేసింది యివతలికి.

ం ం ం

పాప అతనికి బాగా మాలిమి అయింది- అతనింట్లో వున్నంత సేపూ అతని దగ్గిరే

"పావకి పాలుపట్టే వేళయింది. వంపుతారా?" అతని వాటా ముందు నిలబడి అడిగింది రాజ్యం.

'పాపా, వెళ్తావా?' అతను అడిగాడు.

పాప అతన్ని అతుక్కుంది.

'మీకు పిల్లలంటే యిష్టమనుకుంటా?' ఇద్దర్నీ అలా చూస్తూ అడిగింది రాజ్యం.

"పిల్లలంటే యిష్టపడని వాళ్ళుంటారన్నా నేను నమ్మను సుమండీ. మీరు నిలబడే వున్నారు" అతను పావనెత్తుకుని

లేచాడు.

"మీకెందరు పిల్లలు?" తీరా అడిగాక అడక్కుండా వుండాల్సింది అనుకుంది.

"నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?" నవ్వుతూ అడిగాడు.

తమాషాగా మాట్లాడుతాడు అనుకుని "నిజమే చెప్పండీ" అంది నవ్వుతూ.

"నాకింకా పెళ్ళి కాలేదు. అందులో కథ కూడా వుంది. చెప్పమంటారా?

"చెప్పండి"

"నో. నో. నేను గదిలోపల. మీరు బయట-మీకు అభ్యంతరం లేక పోతే యిలా వొచ్చి కూర్చోండి. అప్పుడు చెప్తాను." రాజ్యం తటపటాయించింది.

అది గమనించి "మన ఆడవాళ్లు అంతే నండీ, పరాయివాడు పలకరిస్తే చాలు బెదిరిపోతారు. అదే ఫారిన్ కంట్రీస్‌లో చూడండి. నదురూ బెదురూ లేకుండా ఎంత ఫ్రెండ్లీగా వుంటారో" అతనలా అనేసరికి రాజ్యం లోపలికి వొచ్చి, కుర్చీలో కూర్చో బోయింది.

'ఆ. ఆ. ఒక్క నిముషం ఆగండి'. అతను చప్పున అక్కడికొచ్చి, కుర్చీని గోడకి జరిపి "దీనికి కొంత సపోర్టు కావాలండీ, లేక పోతే కూర్చోనివ్వదు" అంటూ గోడకి బాగా అనించి

"యిప్పుడు కూర్చోండి" అన్నాడు.

రాజ్యం నవ్వి, కూర్చుంది.

అతను పాపని వొళ్ళో పెట్టుకుని మంచం మీద కూర్చున్నాడు.

"నేను మా అమ్మకి రెండోవాణ్ని మూడో సంతానాన్నండీ. అందరికన్నా పెద్ద అన్నయ్య, తర్వాత ఒక అక్క, ఒక చెల్లి. ఆ యిద్దరికీ పెళ్ళిళ్ళు అయినాయి వాళ్ళ పెళ్ళిళ్ళప్పులూ, కట్నాలూ, నా పెళ్ళి ద్వారా రాబట్టాలని మావాళ్ళ ప్లాను. నేను బియ్యే పాసయ్యాను లక్ష కట్నం ఎవరిస్తే వాళ్ళకి అమ్మెయ్యాలని ప్రయత్నిస్తూంటే సహించలేక పోయాను. ఆ లక్ష నేనే సంపాదించి మీకిచ్చాకే నాకు నచ్చిన పిల్లను నేను చేసుకుంటానని ప్రతాపాలు పలికి యిలా వొచ్చేశాను. చెప్పండి. నే చేసిన పని తప్పంటారా? రైటంటారా?"

అతని ప్రశ్నకి రాజ్యం నవ్వి వూరుకుంది.

"అంత కట్నం తెచ్చిన అమ్మాయి నన్ను గౌరవించదని నా నమ్మకం. అందుకే బాగా సంపాదించాక గానీ పెళ్ళి మాట ఎత్తగూడదనుకున్నాను"

"ఇప్పుడు బాంకులూ, యస్ యఫ్. సి లు రుణాలిస్తున్నాయిగా. ఏదో ఒక యిండస్ట్రీ పెట్టి లక్షలు సంపాదించగల నన్న నమ్మకం వుంది నాకు. అప్పుడే పెళ్ళి"

రాజ్యం వింటూంది.

"నన్ను చేసుకున్నందుకు నా భార్య ఏ క్షణానా బాధపడకూడదు. ఆమెను దేవతలా ఆరాధిస్తాను. స్నేహితురాలిగా అభిమానిస్తాను. అపురూపంగా చూసు కుంటాను. భార్యంటే నా దృష్టిలో పని పాటలు చెయ్యటానికీ, పిల్లల్ని కని పెట్టటానికీ కాదు"

"వస్తానండీ" అని పిల్లను అందుకుని వొచ్చేసింది రాజ్యం.

పాపని పడుకోబెట్టి పక్కనే కూర్చుంది.

అతని మాటలు చెవిలో గింగురుమం

టున్నాయి.

"భార్యంటే నా దృష్టిలో పనిపాటలు చేయడానికి కాదు దేవతలా ఆరాధిస్తాను. స్నేహితురాలిగా అభిమానిస్తాను"

ఆ సాయంత్రం పూర్ణించి వచ్చిన మూర్తిమీద అకారణంగా విరుచుకు పడింది.

○ ○ ○

పెరటిగుమ్మందగ్గర ఏదో పేపరు చదువుతూ నిలబడ్డది రాజ్యం.

అప్పుడే బాత్‌రూంలోంచి వచ్చి తన వాటాలోకి వెడుతూ "రాజ్యంగారూ, ఏమిటండీ అంత సీరియస్‌గా చదువుతున్నారూ" అన్నాడు.

"డాక్టరుగారు స్వేచ్ఛగురించి తన అభిప్రాయం రాసి చదవమని మా ఆయన కిచ్చారు. ఏం తోచక నేను చదువుతున్నాను" అంది రాజ్యం.

"ఏదీ యిలా యివ్వండి" రాజ్యం దగ్గరికొచ్చి చేతిలో కాగితం అందుకుని అక్కడే నిలబడి చదివి,

"బాగా రాశారండీ. స్వేచ్ఛకోసం ఆయన పడే తపనని ఆరాటాన్నీ బాగా వ్యక్తం చేశారు. ఈ వాక్యాలు చూశారా?" అంటూ కొన్నిటిని ఎత్తి చూపాడు.

"స్వేచ్ఛ అంటే తననుంచి తనను సమాజంనుంచీ విముక్తి. భయంనుంచి వికాసంలోకి. సమగ్రత వైపు, వీడు పుట్టకముందే వీడి మతం స్థిరపడింది. వీడి జీవితానికి న్యాయం నడవాల్సిన హద్దులు ముందే నిర్దేశింప బడినాయి.

పుట్టక ముందునుంచీ స్వేచ్ఛకు, స్వతంత్రానికి, చట్టాల మతాల నీతుల మేకులు కొట్టినదెవరు? ఆ శిలువను మోస్తూ బతుకుతున్న మనిషి! మనిషిగా నీకు పునర్జన్మ ఎప్పుడు. నిజం. స్వేచ్ఛ అంటేనాకు తెలిసినది ఒకే అర్థం. భయం లేక పోవటం. దయచేసి నన్నా ప్రపంచం లోకి వొదిలిపెట్టండి."

"యీయన చలంగారి ఫాలోయరనుకుంటా?"

"ఎలా చెప్పగలరు?"

"మీరు చలం పుస్తకాలు చదవలేదా?"

"ఏమో గుర్తులేదు. ఏది దొరికితే అదే చదివే అలవాటు"

ఉన్నట్టుండి టాపిక్ మార్చాడు మూర్తి.

"రాజ్యం గారూ. నేను యింట్లోకి వొచ్చినప్పట్నుంచీ అనుకుంటాను మూర్తి గారితో పరిచయం చేసుకోవాలంటే కుదరటంలేదు"


చటుక్కున అనేసింది రాజ్యం "ఉండికి, నిద్రకేగా ఆయనఇంటికొచ్చేది"

అతను రాజ్యంవైపు చూశాడు.

"సరిగ్గా మీలాగే ఎందరో ఆడవాళ్ళు భర్తల్ని గురించి చెప్పుకుంటారు. మన భారతదేశంలో అతను తిరుగుబోతు, లుచ్చా ఎవడైనాసరే, మూడు ముళ్లు వేయించుకున్న పాపానికి ఇష్టంలేకున్నా సరే, అతన్నే అంటిపెట్టుకొని పడివుంటున్నారు. ఎందుకు?-సంఘం అంటే భయం. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటం"

రాజ్యం వుదాసీనంగా వుండిపోయింది

"చలం పుస్తకాలు నాదగ్గర కొన్ని వున్నాయి. స్వేచ్ఛ, స్త్రీ స్వాతంత్ర్యం అంటే ఏమిటో మీకు అర్థమవుతుంది. నా దగ్గర చలం మైదానం వుండాలి. వెతికి తీసుకోండి. ఓ, మీతో మాటల్లో




పడితే–టైమే తెలీదు. ఓ ఫ్రెండుని కలవాలి. వెళ్ళాలి'' అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు హరి.

రాజ్యం చేతిలో కాగితంతో కక్కడ్నుంచి లేవలేదు

ఆరాత్రి స్వేచ్ఛగా చదివిన రామూర్తి మితిమీరిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మనిషిని నిర్వీర్యం చేస్తాయేమో అనుకున్నాడు.

○ ○ ○ ○

రాజ్యం కాస్త మంచి చీరతో తయారైతే "యీచీర మీకెంతో బాగుందండీ" అంటాడు కాస్త ఫ్రెష్‌గా కనిపిస్తే 'ఏమిటలావున్నారు? వొంట్లో బాగోలేదా?' అని ఆదుర్దా పడతాడు ఆమెకోసం పుస్తకాలు తెస్తాడు వాటిని గురించి చర్చిస్తాడు. ఆమె చేసే ప్రతిపనినీ మెచ్చుకుంటాడు. ఆమె ఒక్కరోజు కనిపించకపోతే "రాజ్యంగారూ నిన్న కనిపించలేదేం?" అని అడుగుతాడు.

పాప కోసం తినుబండారాలు, ఆట వస్తువులు తెస్తాడు.

రాజ్యం మనోస్థితి చిత్రంగా మారిపోయింది. అతనితో మాట్లాడాలనీ, అతని సాన్నిధ్యంలో గడపాలనీ మనసు పురకలు వేస్తూవుంటుంది. తన మనోభావాలు అతనికి వెల్లడించుకోవాలని తహతహలాడుతూ వుంటుంది.

అప్పుడప్పుడు మూర్తి స్థానంలో హరి తన భర్త అయివుంటే అన్న వూహలు వస్తాయి.

మంచం మీద కూర్చుని పఠనాన్ని మర్చిపోయి వూహల్లోకి వెళ్ళి పోయింది రాజ్యం

"స్వరాజ్యం" మూర్తి పిలిచాడు

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

'ఏం లేదు'

వూరికే పడుకుని వుండి పోయింది.

○ ○ ○

ఓరోజు మధ్యాహ్నం హరి రాజ్యాన్ని

పిల్చి 'రాజ్యంగారూ. ఎడ పోకుండా త్వరగా రెడీ అవండి. కెమేరా తెచ్చాను. మిమ్మల్ని పాపనీ ఫోటోలు తీస్తాను' అన్నాడు.

రాజ్యం పావు గంటలో తయారై బయటికివొచ్చింది. అతను పెరట్లో కెమేరాతో సిద్ధంగా వున్నాడు.

రాజ్యాన్ని చూడగానే అతను చూపు తిప్పుకో లేక పోయాడు.

రెప్పవాల్చకుండా చూస్తూ వుండి పోయాడు

రాజ్యానికి అడుగు పడలేదు. మెట్ల మీదనే ఆగిపోయింది.

అతని చూపుల్లో ఏదో ఆకర్షణ. సూటిగా. వాడిగా గుండెల్ని తాకే ఆచూపు రాజ్యాన్ని స్పందింప జేస్తూంది. సంచలనాన్ని రేపుతుంది ఆమెలో.

రాజ్యంచూపులు నేలకు అంటుకు

"రాజూ" చిన్నగా పిలిచాడు అతను

తనపేరు అంత బాగుంటుందా? మెల్లగా కళ్ళెత్తింది

ఆమె తను మనోప్రాణాలు పువ్వులా వికసించాయి.

అతను సంబాళించుకుని 'సారీ. రండి' అన్నాడు.

రాజ్యం అడుగులో అడుగేసుకుంటూ వొచ్చినిలబడింది.

"ఇక్కడ కాదు. అటు" అంటూ అతను రాజ్యాన్ని చెట్లుబాక్‌గ్రవుండులో వొచ్చేలాగా నిలబెట్టి యిద్దర్నీ కలిసికొన్ని విడివిడిగా కొన్ని ఫోటోలు తీశాడు

"రేపిపాటికి ఫోటోలు తెచ్చి చూపిస్తాను. మీకోసం ఓ ఫ్రెండును అడిగి తెచ్చాను."

"ఇతనికి కాబోయే భార్య ఎంత అదృష్టవంతురాలో" అనుకుంది రాజ్యం లోపలికొస్తూ.

నాలుగింటికి యింటికొచ్చిన మూర్తి రాజ్యం తయారై వుండటం చూసి "సినిమాకి వెళ్తున్నావా?" అనేసి హడావుడిగా వెళ్ళిపోయాడు

రాజ్యం మూర్తినీ, హరినీ పోల్చి చూసుకుంది.

o o o

"మదర్ సీరియస్ స్టార్ట్ యిమిడియట్లీ" అన్న టెలిగ్రాం చూసుకుని రాజ్యాన్నికూడా బయలుదేరమన్నాడు మూర్తి.


"ఆ వూళ్ళో నేను ఒక్క గంటకూడా వుండలేను బాబూ. నువ్వెళ్ళిరా" అంది రాజ్యం మూర్తి వెళ్ళిపోయాడు

రెండ్రోజుల తర్వాత "మూర్తిగారు కన్పించటంలేదు. వూర్లో లేరా?" అని పలకరించాడు హరి.

"వాళ్ళమ్మకి బాగాలేదని చూట్టానికి వెళ్లారు" జవాబిచ్చింది రాజ్యం

ఆరోజూమర్నాడూ పక్కవాటా తలుపులు తెరిచేవున్నా హరి బయట కన్పించలేదు పాప చాలా సార్లు లోపలికెళ్ళి తిరిగొచ్చేసింది రాజ్యానికేమీ తోచలేదు.

"ఒకవేళ వొంట్లో బాగోలేదా? జ్వరంగానీ వొచ్చిందా? పాపం వొంటరిగా వుంటున్నాడు కూడాను" అనుకుంటూ లోపలికెళ్ళింది. అతను పడుకుని వున్నాడు. చిన్నగా మూలుగు వినిపిస్తూంది. లోపల లైటుకూడా లేదు. లైటు వేసి మంచం దగ్గరగా వెళ్ళి చూసింది. మోచేతి వొంపులో ముఖం




దాచుకుని నిద్రపోతున్నాడు

"హరీ" మృదువుగా పిలిచింది.

పలకలేదు.

మంచంపక్కనే నిలబడి కొంచెం వొంగుని "హరీ" అంటూ మళ్ళీ పిలిచింది. అతను "వూ" అంటూ మొహం మీది చెయ్యి అడ్డు తొలగించిచూశాడు.

కళ్ళు ఎర్రగా వున్నాయి మొహం వాడి కందిపోయి వుంది.

"జ్వరం వచ్చిందా?" అప్రయత్నంగా చేత్తో అతని నుదుటికి తాకింది. వెచ్చగా వుంది.

"జ్వరం వొస్తే నాకెందుకు చెప్పలేమా?" అతని కళ్ళల్లోకి అభిమానంగా చూసింది. అతను చిరునవ్వు నవ్వాడు.

"కాఫీ తెస్తాలాగండి" అంటూ రాజ్యం తమ పోర్షనులోకి వెళ్ళి స్టౌవెలిగించి కాఫీ కలిపి ఓ జ్వరం మాత్రతో తిరిగొచ్చి అతనితో తాగించింది. అతను కృతజ్ఞతగా రాజ్యాన్ని చూసి 'ఇక వెళ్ళండి' అన్నాడు

రాజ్యం వొచ్చేసినా ఆ రాత్రి ఆమెకు నిద్ర రాలేదు. మర్నాడు ఉదయానికంతా అతనికి జ్వరం దిగిపోయింది

రాజ్యం అతన్ని చూడటానికి వెళ్ళింది.

"థాంక్స్. మీచేతి మాత్రకి, కాఫీకి, జ్వరం దిగిపోయింది' అన్నాడు.

ఆ మధ్యాహ్నం హోటలు భోజనం వొద్దని రాజ్యం తనే వంటచేసి పెట్టింది. ఆ సాయంత్రానికి అతను మామూలుగా అయిపోయాడు. పాపని నిద్రపుచ్చి, ఏమీ తోచక ఏం చేస్తున్నాడోనని అతని వాటాలోకి తొంగిచూసింది

మంచంమీదపడుకుని ఏదో పుస్తకం చదువుతున్నాడు. గది గుమ్మం వరకూ వచ్చి ఆగిపోయింది.

అడుగల చప్పుడికి అతను పక్కకు తిరిగి చూశాడు. రాజ్యాన్ని అలాచూస్తూ వుండిపోయా . రాజ్యం ఇబ్బందిగా ఫీల్ అయినా వెళ్ళలేక, వుండలేక అలాగే నిలబడిపోయింది.

"రాజూ" మందస్వరంతో పిలిచాడు.

"ఇలారా"

అడుగులో అడ గేస్తూ అతన్ని సమీపించింది. చేయిపట్టుకుని పక్కన కూచోబెట్టుకుని కళ్ళల్లోకి చూశాడు.

"రాజూ నువ్వు నాకు కావాలి" అంటూ రెండుచేతులూ ఆమె భుజాల మీదవేసి మీదికి లాక్కున్నాడు. అదురుతున్న గుండెలతో తమకంగా అతని గుండెలమీద వాలిపోయింది రాజ్యం.

అతను ఏవేవో మాటలు గుసగుసలు చెప్పాడు రాజ్యం చెవిలో. స్వర్గం చూపించాడు మాటల్లో.

ఆరాత్రి తిరిగి తన వాటాలోకి వెళ్ళలేదు రాజ్యం

ం ం ం

బతకదనుకున్న తల్లి కోలుకోవటంతో మనస్థిమితంచిక్కి యింటికి తిరిగొచ్చాడు. మూర్తి తలుపుకి వేసివున్న తాళంచూసి రాజ్యం పుట్టింటికి వెళ్ళివుంటుందనుకుని మరరోజునుంచి డ్యూటీకి వెళ్ళసాగాడు. వారం గడిచినా రాజ్యం రాకపోయేసరికి తనే మామగారింటికి వెళ్ళాడు.

రాజ్యం రాలేదని తెలిసింది

ఇంటికొచ్చి రాజ్యం పెట్టెలు వెతికి నిశ్చేష్టుడయ్యాడు.

ఆమర్నాటికంతా రాజ్యం లేచిపోయిందన్న వార్త వూళ్ళో సగంమందికి తెలిసింది.

చెంచయ్య కూతురు చేసిన పనికి తలెత్తుకోలేకపోయాడు వీధిలోకి వొచ్చి నలుగురికీ ముఖం చూపించాలంటే అతనికి తలకొట్టేసినట్టుగా వుంది. నాలుగు రోజులు అడితీ తెరవలేదు తల్లి, మేనత్త నెత్తీనోరూ బాదుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చారు. అన్నలు అసహ్యించుకున్నారు. హైదరాబాదలో వుద్యోగం చేస్తున్న వేణు "నాన్నగారూ, మీరు అక్కడ వుండలేననుకుంటే యిక్కడికి వొచ్చెయ్యండి. తమ్ముళ్ళకి వుద్యోగాలకి యిక్కడే ఎలాగో ప్రయత్నాలు చేద్దాం. అది మీకడుపున పుట్టిందన్న సంగతి మర్చిపొండి. నన్నొచ్చి ఏర్పాట్లు చెయ్యమంటే చేస్తాను" అని తండ్రికి ధైర్యం చెపుతూ రాశాడు అతను.

పదిహేను రోజుల్లో అడితీ అమ్మేసి చెంచయ్య హైదరాబాదుకి మకాం మార్చాడు.

ం ం ం

మూర్తికి వుద్యోగం ఒక్కటే వుపశమనం కల్గిస్తూంది.

తీరిక వేళల్లో ఎడతెగని ఆలోచన.

ం ం ం ం

మాధవి రాయడం ఆపి కూర్చుండిపోయింది. ఇంతవరకు రాసింది జరిగిన కథ. ఇకమీద కథ ఎలా జరగనున్నదో.

మూర్తి జీవితం ముందుముందు ఎలా వుంటుంది?

అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడా? అతను భాగ్యను అర్థంచేసుకోలేని మూర్ఖుడేమీ కాదు రాజ్యం అంటే అతనికి ఇప్పటికీ అభిమానం వుంది.

అయితే వుద్యోగాన్ని సక్రమంగా

చెయ్యటం ఒకటేగా అతని బాధ్యత? తన్ని నమ్ముకున్న తన వాళ్ళని సుఖపెట్టటం సంతోషపెట్టటం తన ధర్మంగా బాధ్యతగా గుర్తెరగవద్దూ?

మరి ఆమెను నిజంగా ప్రేమించే తీసుకుపోయాడా?

మోజు తీరాక వదిలేస్తే? మగవాడి అంగలేకుండా ఆ తటి జీవించగలిగే ఆరోగ్యకరమైన వాతావరణం మనకు వుందా? రాజ్యం చచ్చిపోతుందా?

మరి మీరా?

పిల్లలకోసం బతకాలనుకుంటే రాజ్యం వొళ్ళమ్ముకుంటుందా? ఉహూ. అలా జరక్కూడదు.

పతితగామారిన ప్రతిస్త్రీ వెనుకా ఒక కథ వుండే వుంటుంది.

రాజ్యం ఒకవేళ తిరిగొస్తే....

మూర్తి స్వీకరిస్తాడా? ఎప్పటిలా ఆమెను ఆదరిస్తాడా?

అంత ధైర్యం వుంటుందా?...

మాధవి తిరిగి కలం చేతిలోకి తీసుకుంది.

o o o o

ఆరోజు ఆగస్టు 15. దేశానికి స్వాతంత్ర్యం వొచ్చినరోజు.

ఆ సాయంత్రం....ఆకాశం మేఘావృతమైవుంది.

ఇప్పటికో ఇంకాసేపటికో వర్షంవచ్చే సూచనగా గాలి విసురుగా వీస్తోంది. కిటికీ రెక్కలు టపటప కొట్టుకుంటున్నాయి.

మూర్తి పడకుర్చీలో వాలి ఆరోజు పేపరు చదువు తున్నాడు.

పురుగులు లోనికి వస్తున్నాయి. దీపం చుట్టూ ముసురుతున్నాయి. అప్పుడప్పుడు రెక్కలూడిన పురుగులు అతని మీద పడుతున్నాయి.

అతను వాటికి కాస్త దూరంగా కుర్చీని జరుపుకుని కూచున్నాడు.

సన్నగా జల్లు మొదలయింది.

అతను పేపరు చదవటం ఆపి ఆలోచనలో పడ్డాడు.

మతకలహాలు- దోపిడీలు- మానభంగాలు- తిరుగుబాట్లు-

గేటు చప్పుడకి, ఆలోచనల్లోంచి బయటికొచ్చి, చప్పున పేపరులోంచి ముఖం పైకెత్తి చూశాడు.

ఎవరో ఆడమనిషి -

తలమీదుగా కొంగు. భుజాన పిల్ల

బయట చీకటిగా వుండటాన ఆవ్యక్తి ఎవరైనదీ పోల్చుకోలేక పరీక్షగా చూశాడు.

ఆమె గేటుదగ్గిర్నుంచి మెట్లెక్కి గదిలోకి నాలుగడుగులే అయినా-ఆ నాలుగడుగులూ వెయ్యటానికి ఎంతోసేపు పట్టింది.

గుమ్మందగ్గిర తలదించుకుని నిలబడింది.


"స్వ-రా-జ్యం" అనుకున్నాడతను

అలాగే చూస్తూ వుండిపోయాడు.

స్వరాజ్యం తిరిగొచ్చేసింది - అంటే- అవును-అంతే.

అతను ఆమెకు భర్త కాలేక పోయాడు.

దీపం పురుగులు మెడమీద తలమీద పడుతుంటే దులుపుకుంటూ లైటుకేసి చూశాడు. వందలసంఖ్యలో అవి దీపం చుట్టూ తిరుగుతున్నాయి.




భ్రమతో - భ్రాంతితో - ఆక్కదేదో దొరుకుతుందనే ఆశతో.

రెక్కలు రాలగానే నేలమీద పడి పోతున్నాయి.

అతను రాజ్యం మీదకి చూపు మరల్చాడు.

రాజ్యం అలాగే నిలబడింది

తనముందు నిలబడిన స్వరాజ్యం తప్పుచేసిన వ్యక్తి. దోషి.

అందుకే ఆమె సిగ్గుతో - అభిమానంతో తలెత్తి పలుకరించే సాహసం చెయ్యలేక గడపవతలే ఆగివుంది.

ఇప్పుడామె బ్రతుకంతా తనమాట మీద ఆధారపడివుంది.

ఆమె భవిష్యత్తుకు తాను కర్త.

అతని ఆలోచనలు తీవ్రంగా సాగుతున్నాయి

తాను ఆమె చేసిన తప్పు చెయ్యలేదు గనక నీతి వంతుడు. గౌరవనీయుడు.

తను నిరాకరిస్తే ఆమె భవిష్యత్తు-

అతని ఆలోచనలు ఎంతో దూరం వెళ్ళాయి. రాజ్యాన్ని చూశాడు. నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

బలహీనతకు రాగద్వేషాలకు అతీతంగా ఉండే మనిషి దేవుడు.

స్వరాజ్యం మామూలు మనిషి కనుక బలహీనతలకు లొంగిపోయింది. జయించలేక పోయింది.

స్వార్థానికి వ్యక్తిత్వానికి మధ్య పోరాటం జరిగింది.

అతని ఆలోచనల్లో మనస్సులో—

మంగ గుర్తుకొచ్చింది

మంగ మద్దూరులో తమ పక్కింట్లో వుండేది. చిన్నప్పట్నుంచీ తనతో కలిసి ఆడేది బడికి వెంటనే వచ్చేది దారిలో గిల్లి కజ్జాలు పెట్టుకునేది. కొట్టేది.

ఆ వూళ్ళో తన చదువు అయిపోయింది. పెద్ద చదువులకు వెళ్ళలేక పోయాడు.

ఏదయినా వుద్యోగం చూసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పేశాడు.

అప్పుడు మంగకు సంబంధాలుచూస్తున్నారు. మంగకు పెళ్ళి కుదిరిందని చెప్పిందని చెప్పింది తల్లి. విని వూరుకున్నాడతను.

ఆ రోజు రాత్రి మంగ ఆరుబయట పడుకున్న తన్ను మంగలేపి చెట్టు చాటుకు

తీసుకుపోయింది.

"మూర్తీ నన్ను నీతో ఎటయినా తీసుకుపో. మనిద్దరం హాయిగా బతకొచ్చు. నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు. నిన్ను చేసుకుంటానంటే వాళ్ళు వొప్పుకోవటం లేదు. నువ్వు వొప్పుకోకపోతే బావిలో అయినా పడి చస్తాగానీ ఆ పెళ్ళిమాత్రం చేసుకోను. ఆడపిల్లని ఇంత ధైర్యంచేసి అడుగుతుంటే మగవాడివి సాహసించలేవా? నిన్ను ప్రేమించాను కనుక నేనే ఇంతగా ప్రాధేయపడుతున్నా" అంటూ చాలా ప్రతిమాలింది.

"తప్పు. ఎవరన్నా చూస్తే బాగుండదు. నువ్వుముందు వెళ్ళిపో" అని ఆమెను బలవంతంగా పంపేశాడు. ఓ గంట తర్వాత అమ్మ గాభరాగా లేపింది. 'మంగ నూతిలోపడి ప్రాణాలు తీసుకుందిరా' అంటూ

అచేతనంగా అలావుండి పోయాడు తను,

మంగ అన్నంత పనీచేసింది. మంగ చావుకి తనే కారణమనుకుంటే మనసంతా కెలికినట్లయింది.

అమర్నాడే వుద్యోగానికై వొచ్చేశాడు నరిగ్గా స్వరాజం చేసిన తప్పే చెయ్యలేక పోయినా తన మహానుభావుడే మీకాదు

○ ○ ○

వెక్కి వెక్కి ఏడుస్తోంది రాజ్యం.

"స్వరాజ్యం. లోపలకురా" పిల్చాడతను

స్వరాజ్యం దిగ్గునతలెత్తి ఆశ్చర్యంగా చూసింది

'నిజంగా_ నిజంగానే అంటున్నారా ఎగతాళికా?'

అతని గొంతు అలా ధ్వనించలేదు.

అతనిముఖం ఎప్పటిలాగే ప్రశాంతంగా-గంభీరంగా వుంది.

ఆమె సంభ్రమాశ్చర్యాలనుంచి తేరుకోలేదు

అతనులేచాడు-దగ్గరగా వొచ్చిభుజం మీద చెయ్యివేసి పొదివి పట్టుకున్నాడు.

ఆమె అతని వెనకే వొచ్చి గది మధ్యలో ఆగి పోయింది.

అతను ఆమెను మంచంమీద పడుకోబెట్టి దుప్పటి కప్పి ఇటు తిరిగాడు.

ఆమె అతనివైపు తడికళ్ళతో చూస్తూవుంది.

అతను ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు

ఆచూపుల మెకు ధైర్యాన్ని బలాన్ని యిచ్చాయి

హృదయపు లోతులను స్పృశించాయి.

పరివర్తనతో ఆమె హృదయం కంపించింది

మనసులో వ్యధ, చేసిన పావం కన్నీటి రూపంలో ప్రవహించాయి.

ఆమె అతని కాళ్ళకు చుట్టుకు పోయింది.

"రాజూ నేను మామూలు మనిషిని. నిన్ను శిక్షించే అర్హత లేనివాడ్ని కాబట్టే క్షమించటం నా ధర్మం"

అనుకుని ఆమెను లేవనెత్తాడు

కృతజ్ఞతతో ఆమె మనసు నిండిపోయింది. అతని మంచి మనసుకీ ఆదరణకీ తట్టుకోలేక కన్నీరు చెక్కిళ్ళమీదుగా జారింది.

అతను ఆమెను హృదయానికి హత్తు

కున్నాడు.

o o o o

కథ వ్రాయడం ముగిసే సరికి గడియారం రెండు గంటలు కొట్టింది.

మాధవి, రాసిన కాగితాల బొత్తి మీద పేపరు వెయిట్ వుంచి బద్ధకంగా లేచి కళ్ళు మూసుకుని మాధవి గదిలో యింకా లైటు వెలుగుతుండటం చూసి నరేంద్ర మాధవి గదిలోకి వచ్చాడు.

మాధవి కళ్లు మూసుకుని పడుకుని వుంది.

టేబిల్ మీది కాగితాలు ఫ్యానుగాలికి రెపరెప మంటున్నాయి.

ఇంత రాత్రి వరకూ కూర్చుని మాధవి రాసిన విషయం ఏమిటి?

కుతూహలంతో అతను కాగితాలు చూశాడు.

వెలుగురేఖ కథ, అతను అక్కడక్కడా చదివి, కథ పూర్తిచేసి కాసేపు కాగితాలకేసి చూస్తూ వుండిపోయాడు.

"ఉద్యోగ ధర్మానికి న్యాయం చేకూర్చటం ఒక డాక్టరుగా అతని బాధ్యత. అతన్ని నమ్ముకున్న తన వాళ్ళని సుఖపెట్టటం తన ధర్మంగా బాధ్యతగా గుర్తెరగవద్దూ "

ఆ వాక్యంమీద అతని చూపులు నిలిచిపోయాయి మనసులో ముల్లుగుచ్చుకున్నట్లయింది నిజమే పదేళ్ళ క్రితం ... మాధవి, బాబు, తమతో చిన్న ప్రపంచం ఎన్నో ఆశలుండేవి. కలలుండేవి, చిన్న యిల్లు కట్టుకోవాలి ఆ ఇంట్లో హాయిగా కాపురంవుండాలి. చదివిన డాక్టరీవృత్తిని వ్యాపారంగా మార్చుకోగూడదు. ప్రజాసేవకి జీవితం అంకితం చెయ్యాలి. ఎన్నో ఆలాటివి మాధవి ఎంతగానో సహకరించేది తనకు సలహాలిచ్చేది, తన అభివృద్ధికి సోపానమై నిలిచింది. అలాటి మాధవితో మాట్లాడటానికి తనకీనాడు తీరిక వుండటంలేదు

ప్రాక్టీసు బాగా పెరిగింది. నర్సింగ్ హోమ్ కట్టాడు. రెండు క్లినిక్‌లు-రెండు లాబొరేటరీలు అయ్యాయి. తానిప్పుడు లక్షాధికారి పత్రికల పెట్టుబడితో ఇండస్ట్రీ తెరవాలనుకుంటున్నాడు. ఇంకా తృప్తి లేదు అనుక్షణం అర్థం మీదే దృష్టి. తన లక్ష్యం సంపాదనే. అంతే తానీ తనకు తెలియకుండానే మాధవికి దూరమవుతూ వచ్చాడు. తనవాళ్ళతో మాట్లాడే వ్యవధి వుండటంలేదు. టిఫిన్ తీసుకునేటప్పుడు, భోజనం సమయంలో - ఓ పది నిముషాలు-అతనికి గడిపిన రోజుల తాలూకు మధు స్మృతులు గుర్తుకు వచ్చాయి.

కాగితాల మీద వెయిట్‌వుంచి యిటు అటున్నించి ఇటు తిరిగాడు.

మాధవి అతని వంకే చూస్తోంది.

అతని చూపులు మాధవి చూపుల్లో కలిశాయి.

"మాధవీ; నేను పూర్తిగా మరమనిషిని అయిపోకముందే నాలో మనిషిని మేల్కొలిపావు కృతజ్ఞుడిని" పెదవి విప్పి చెప్పుకోలేని మాటల్ని కళ్ళతో నివేదించుకున్నాడు

మాధవి సన్నని పెదవులు బిగించి, చిన్నగా నవ్వింది

గుండెల్లో నిండిన ఆనందం కళ్ళల్లో ప్రతిఫలిస్తూండగా. తన వైపు నడచివస్తున్న భర్తను చూస్తూ వుండిపోయింది.★